క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భామిని: మండలంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కొరమ ఫీడర్ పరిధిలోని 11 కేవీ లైన్‌ను విభజించి, కొత్త లైన్‌కు కలుపుతున్నందున లివిరి నుంచి కొరమ గ్రామాల మధ్య ఉన్న గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చౌడేశ్వరిదేవి అమ్మవారికికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలో దేవాంగుల ఇలవేల్పుగా పేరొందిన పార్వతీదేవి ప్రతిరూపం చౌడేశ్వరి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారి విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ క్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కోటదుర్గమ్మ దేవస్థానం ప్రధానార్చకులు లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో సామూహిక పూజలు, అర్చనలు భక్తులు చేశారు.

సన్మానం



సన్మాన గ్రహీతలతో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు

పాలకొండ: మండలంలోని ఓని గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బి.నాగమణి, పి.శారదాకుమారి, జి.సూర్యనారాయణ, ఎస్.వెంకటరమణలను గురువారం అదే పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు హాజరై, వారి సేవలను ప్రశంసించారు. విధి నిర్వహణలో మనం చేసిన మనకు గుర్తింపునిస్తాయని, ప్రతిఒక్కరూ ఎక్కడ పనిచేసినా బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పుష్పలత, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట: మండలంలోని పీపీ ఈతమానుగూడ ప్రాంతంలో తరలిస్తున్న 20 లీటర్ల సారాను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వై.అమ్మనరావు గురువారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, సవర బాలెమ్మ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

భామిని: మండలంలోని మనుమకొండ గిరిజన ఆశ్రమ పాఠశాలను బత్తిలి వైద్యాధికారులు కె.రవీంద్ర, దామోదరరావులు గురువారం సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, వారి కోసం సిద్ధం చేసిన భోజనాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారం కూడా అందివ్వాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల ఎత్తు, బరువు చూడడంతో పాటు వారికి హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు.

వెంకటరమణయ్యకు ఘనంగా నివాళులు



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ గణేష్, పాఠకులు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ బి.గణేష్, పాఠకులంతా కలిసి అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల ఏర్పాటుకు వెంకటరమణయ్య చేసిన కృషిని వక్తలు కొనియాడారు. గ్రంథాలయాల కోసం ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందన్నారు.

నిధులు లేకుండా పంచాయతీ అభివృద్ధి ఎలా?

జియ్యమ్మవలస రూరల్: పంచాయతీల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అభివృద్ధి ఏ విధంగా చేయాలని పెదబుడ్డిడి సర్పంచ్ సీమల సుజాత ప్రశ్నించారు. ఇదే విషయమై ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వం చెబుతోందని, పంచాయతీల్లో చూస్తే నిధులు లేవన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపినప్పటికీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదన్నారు. పారిశుధ్య పనులు, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు, మౌలిక సదుపాయాలు ఎలా అని వెంటనే నిధులివ్వాలన్నారు.

● గణపయ్యలు సిద్ధం..



వినాయక చవితి ఉత్సవాలకు గణపయ్య విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ప్రతి ఊరిలో ఎంతో ఘనంగా నిర్వహించుకునే ఈ పండగను ఒకరిని మించి మరొకరు మిన్నగా చేసేందుకు పోటీపడుతుంటారు. ముఖ్యంగా భారీ విగ్రహాల కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తారు. ఎవరు ఎంత ఎక్కువ ఎత్తు విగ్రహం పెడితే వారు అంత బాగా వేడుకలు చేస్తున్నట్లు అంతా భావిస్తారు. ఆగస్టు 27న పండగ కావడంతో పాలకొండలో గణేశుని విగ్రహాల తయారీ ఊపందుకుంది. రూ.500 నుంచి రూ.20 వేల విలువైన విగ్రహాలు అందుబాటులో ఉండగా, వీటిని కొనుగోలు చేసేందుకు ఇప్పటికే పలువురు అడ్వాన్సులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. -పాలకొండ రూరల్

● రోడ్డు మధ్యలో గోతులు



ఈ చిత్రంలో కనిపిస్తోంది..వీరఘట్టం మేజరుపంచాయతీ ప్రధాన రోడ్డు మధ్యలో తీసిన గోతులు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు నిమిత్తం తీసిన ఈ గొయ్యిలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారాయి. పాలకొండ రోడ్డులో పెట్రోలుబంకు దాటిన తర్వాత మలుపు దగ్గర మూడు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు తీసిన ఈ గోతులు ఏం ప్రమాదం తెచ్చిపెడతాయా అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా మలుపు వద్దనే ఇవి ఉండడంతో వాహనదారులు నెమ్మదిగా రాకపోయినా అప్రమత్తంగా ఉండకపోయినా ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని అంటున్నారు. అధికారులు స్పందించి, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. -వీరఘట్టం

● గిరిజనుల ఆందోళన



తాము సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని జియ్యమ్మవలస మండలంలోని ఏనుగులగూడ, గడసింగపురం గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు పలు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వీరఘట్టం తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. వీరఘట్టం మండలంలోని చిన్నగోర రెవెన్యూ పరిధిలో లక్ష్మీదేవి కొండ, రాళ్లగెడ్డ పక్కన ఉన్న 25 ఎకరాల భూమిని గత 20 ఏళ్లుగా సాగు చేసుకుని బతుకుతున్నామని, అయితే ఆ భూములు తమవని వీరఘట్టం మండలంలోని సంత-నర్సిపురానికి చెందిన కొంతమంది తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమపై దాడి కూడా చేశారని, వాపోయారు. దాడికి ఎగబడిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ భూములకు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు ఎ.ఎస్.కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి.రమణారావు, పి.భాస్కరరావు, ఎన్.సింహాచలం, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు. -వీరఘట్టం

మెలకువలతో సాగుదాం!

- వర్షాల వేళ ఊపందుకున్న వరి ఉభాలు
- మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు
- పంట ప్రారంభం నుంచే జాగ్రత్తలు తప్పనిసరి



లుంబూరు వద్ద రైతులు సిద్ధం చేసిన నారుమడి

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. దీంతో అంతటా వరి ఉభాలు(వరినాట్లు వేయడం) ఊపందుకున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కి పనులు ఓ వైపు చేయడంతో పాటు నారుమడులు మరోవైపు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగులో మెలకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు ఆశించవచ్చని వ్యవసాయ నిపుణులు, అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రతి రైతు ఏ రకపు నేలకు ఏ పంట అనుకూలం. ఏ నేలలో ఏ పంట వేస్తే బాగా దిగుబడి వస్తుందనే విషయం తెలుసుకోవాలంటున్నారు. అలాగే చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు గూర్చి అవగాహన కలిగి ఉండాలని చెబుతున్నారు.

పొలం సిద్ధం చేయండిలా..

- వరినాట్లు వేయడానికి పొలాన్ని దమ్ము చేసే క్రమంలో 2 నుంచి 3 సార్లు మురుగు దమ్ము చేపట్టుకోవడం మేలు
- సాగునేల సమతలంగా ఉండేలా దమ్ములో చెక్కలేక అడ్డతో చదును చేయాలి
- నల్లరేగడి నేలల్లో వరినాట్లు వేయటానికి రెండు రోజుల ముందుగానే దమ్ము చేపట్టాలి. ఆ తర్వాత వరినాట్లు వేసుకోవడం ఉత్తమం

వరినాట్లు ఇలా వేసుకోవాలి..

- సేకరించిన వరినారు లేత ఆకుపచ్చగా ఉంటే మంచిది. 25 నుంచి 30 రోజుల వయసు కలిగిన నారు అయితే దిగుబడి బాగా వస్తుంది



భాసూరు దగ్గరలో వరినాట్లు వేస్తున్న కూలీలు

- నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారు పొలంలో వేసుకునేందుకు ఉపయోగించాలి ముదురు ఆకు నాటాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనలు తప్పనిసరి
- వరినాట్లు వేసే సమయంలో భూసారానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలి
- ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు ఉండాలి. అప్పుడే పైరుకు గాలి, వెలుతురు తగులుతుంది. ప్రధానంగా చీడపీడలు, సుడిదోమలను ఈ విధానంతో సమర్థవంతంగా అధిగమించవచ్చు.
- కాలిబాటల వల్ల ఎరువులు, పురుగుమందులు వేయడం, కలుపుతీయడం సులభంగా ఉంటాయి.
- వరి వంగడాల రకాలను అనుసరించి కుదుళ్ల సంఖ్యను నాటే సమయంలో నిర్ధారించుకోవాలి. భూసారం అధికంగా ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు నాటుకోవాలి.
- ముదురు నారు వాడాల్సి వచ్చినప్పుడు అధికారుల సూచనల మేరకు నత్రజని ఎరువులు వాడుకోవాలి

యాజమాన్య పద్ధతులు..

- భూసారానికి అనుగుణంగా ఉత్పత్తిని పెంచుకునేందుకు రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా సమపాలలో వాడుకుంటే మేలు
- పశువుల ఎరువు, వర్మీకంపోస్టు, సేంద్రియ, రసాయన ఎరువులు కలిపి వాడితే 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా అవుతుంది
- వరి సాగుభూముల్లో అపరాలు, జీలుగు, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైరును కలిపి కలియదున్నడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చు. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులను 25 శాతం మేర ఆదా చేయవచ్చు
- యూరియా, డీఏపీ అసరాన్ని బట్టి వాడాలి.

సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దారు కామేశ్వరరావు

వీరఘట్టం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దారు ఎ.ఎస్.కామేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో గురువారం సమావేశమైన ఆయన..సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు కె.కవిత, వీఆర్వోలు వి.రమేషనాయుడు, కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ డీఈ వెంకటరావు

గుమ్మలక్ష్మీపురం: పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నట్లు గృహ నిర్మాణ శాఖ డీఈ ఎం.వెంకటరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆ శాఖ ఏఈ, వర్క్ఇన్‌స్పెక్టర్లతో గురువారం సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కురుపాం సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో పీఎం జన్‌మన్ గృహాలు 2,774 మంజూరయ్యాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు కేటాయించడం జరిగిందని, పనులు చేపట్టిన తక్షణమే బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో పీఎంఏవై గ్రామీణ పథకం ద్వారా 3,761 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 1632 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగతావి ఆయా వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఈ నిర్మాణాల పూర్తికి కూడా సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గుమ్మలక్ష్మీపురం ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం గురువారం నిర్వహించిన రెండో విడత కౌన్సెలింగ్ ప్రశాంతంగా సాగింది. వివిధ ట్రేడ్‌లలో సీట్లు కోసం 192 మంది దరఖాస్తు చేసుకోగా 137 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు. మొత్తం 51 మందిని ఎంపిక చేయడం జరిగిందని, కౌన్సెలింగ్‌కు హాజరుకాలేని విద్యార్థులకు శుక్రవారం కళాశాల వద్ద కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

భవన నిర్మాణాల పరిశీలన



భవన నిర్మాణ ప్లాన్‌లు పరిశీలిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

పాలకొండ: నగరపంచాయతీలోని పలు భవనాలు, భవన నిర్మాణాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర గురువారం పరిశీలించారు. భవనాలకు కొలతలు వేసి కొలతల ప్రకారం నిర్మించారా..దానికి తగ్గట్టుగా పన్నులు చెల్లిస్తున్నారా అనే విషయం సరిచూశారు. నిబంధనల మేర పన్నులు చెల్లించని వారికి నోటీసులు అందివ్వాలని కమిషనర్ రత్నంరాజును ఆదేశించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



కాలువలోని మురుగు తొలగిస్తున్న దృశ్యం

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరులో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. కాలువల్లోని పూడికలు తొలగించడంతో పాటు వీధుల్లోని చెత్తాచెదారం తొలగించారని సర్పంచ్ ఉపేంద్ర తెలిపారు. 15వ ఆర్థికసంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ కాలేదని, సొంత డబ్బులతో ఈ పనులు చేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 32 పంచాయతీల్లో ఇదే పరిస్థితి అని అన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయాలి

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



కళావతి, మాజీ ఎమ్మెల్యే

వీరఘట్టం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను అందరం నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇదే విషయమై ఆమె మండలంలోని వండవ గ్రామంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక వాటి అమలు మరిచారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, అరెస్టులు చేస్తూ ప్రతిపక్ష నేతలను వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల దృష్టి మళ్లించి హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు ఇచ్చిన ఒకట్రెండు పథకాల్లోనూ లబ్ధిదారులకు మోసమే జరిగిందని వివరించారు. ఎన్నికల సమయంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి ఇప్పుడు మూడు మాత్రమే ఇస్తున్నారని, ఇప్పటికీ వాటి డబ్బులు కొంతమందికి పడలేదన్నారు. అలాగే తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తానని, కొందరికి రూ.13 వేలు, మరికొందరికి రూ.10 వేలు, రూ.8 వేలు లెక్కన పడ్డాయన్నారు. ఇది కాదా మోసం అని నిలదీశారు. ఆడబిడ్డ నిధి ఎప్పుడని అడిగితే మంత్రి అచ్చెన్నాయుడు.. ఆ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సిందేనని అనడం వెనక రహస్యమేంటని ప్రశ్నించారు. ఆ పథకం కూడా ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందనే కదా అని దుయ్యబట్టారు. ప్రజలను కూటమి మోసం చేస్తే ఊరుకోబోమని, ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. పథకాలు మాట అటుంచితే రైతులకు కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో చంద్రబాబు పాలన ఉందన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని వారే రాబోయే రోజుల్లో కూటమికి గట్టి బుద్ధి చెబుతారని హితవుపలికారు.

మహాసభలను విజయవంతం చేయండి

గుమ్మలక్ష్మీపురం: సీఐటీయూ అఖిల భారత జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ కె.గౌరీశ్వరరావు అధ్యక్షతన సీఐటీయూ అనుబంధ రంగాల కార్మికుల సమావేశం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలోని కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని వారి సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ముందుగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో జరుగుతాయని, సెప్టెంబరు 13, 14వ తేదీల్లో పాలకొండలో జిల్లా మహాసభలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ సభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదరికం రూపుమాపడమే ధ్యేయం

గరుగుబిల్లి: పేదరికం రూపుమాపడమే ధ్యేయంగా ప్రభుత్వం పీ4 సర్వే, మార్గదర్శి-బంగారు కుటుంబం పథకం వంటివి చేపడుతోందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని ఉద్దవోలు గ్రామ సచివాలయంలో పీ4 సర్వేపై గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన నిరుపేదల పేదరికంపై మరోసారి చర్చించి, అసలైన నిరుపేదల జాబితాను రూపొందించి వారిని మార్గదర్శులకు అప్పగించడం జరుగుతుందన్నారు. దాతల సాయం ద్వారా పేదల కుటుంబాల్లో వెలుగులు చూడడమే పీ4 సర్వే, మార్గదర్శి-బంగారు కుటుంబం పథకంల లక్ష్యమన్నారు.

● మోకాళ్లపై నిరసన



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు,, వసతిగృహాల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మోకాళ్లపై వినూత్నంగా నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో పాల్గొన్న గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి మొదటి సంతకానికి విలువనిచ్చి, తక్షణమే ఏఎన్‌ఎంలను నియమించాలన్నారు. సంఘ నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, హెల్త్ వాలంటీర్‌లు పాల్గొన్నారు. - పార్వతీపురం

వీరఘట్టం-చలివేంద్రి రోడ్డులో ఆక్రమణలు



బూరగ గ్రామం దగ్గరలో రోడ్డును ఆనుకుని వేసిన కంచె

వీరఘట్టం: వీరఘట్టం-చలివేంద్రి రోడ్డులో ఆక్రమణలు జరుగుతున్నాయి. అదే రోడ్డులో సంత-నర్సిపురం వెళ్లే దారిలో మరీ దారుణంగా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. వీరఘట్టం నుంచి బూరగ వరకు 30 అడుగుల రోడ్డుకు గాను ప్రస్తుతం 12 అడుగుల రోడ్డు మాత్రమే కనిపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూ యజమానులు రోడ్డు బెర్ములను ఆక్రమించడంతో రోడ్డు విస్తీర్ణం బాగా కుదించుకుపోయింది. ఈ ఇరుకైన రోడ్డులో ప్రయాణించాలంటే భయమేస్తోందని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, ఆక్రమణలు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేలకూలిన భారీ వృక్షం



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

సీతంపేట: మండలంలోని కర్రగూడ సమీపంలో ఓ భారీ చింతచెట్టు నేలకూలింది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నేల వదులుగా మారి ఆ చోట ఉన్న వృక్షం ఒక్కసారిగా పడిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. సరిగ్గా రోడ్డుపై చెట్టు పడిపోవడంతో ఇరువైపులా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదృష్టవశాత్తు చెట్టు పడే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు అంటున్నారు.

● నిరుపయోగంగా వే బ్రిడ్జి కాటా



వీరఘట్టం: మార్కెట్ యార్డు ఆవరణలోని వే బ్రిడ్జి కాటా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రూ.10 లక్షలతో నిర్మించిన ఈ కాటాపై ఏ లారీ లోడు బరువు ఇంతవరకు తూయకపోవడం గమనార్హం. సాధారణంగా రోడ్డు పక్కనే ఈ తరహా వే బ్రిడ్జి కాటాలు ఉండడం, వాటిపైనే లారీల బరువు తూయడం జరుగుతుంటాయి. అయితే మార్కెట్ యార్డులో ఉన్న ఈ కాటా మెయిన్‌రోడ్డుకు 200 మీటర్ల దూరం ఉండడం, ఇక్కడొక కాటా ఉందనే విషయం ఎవరికీ తెలియకపోవడంతో ఇది నిరుపయోగంగా ఉందనే వాదన వినిపిస్తోంది. అధికారులు స్పందించి, అక్కడ వే బ్రిడ్జి కాటా ఉందనే విషయం తెలిసేలా బోర్డు ఏర్పాటు వంటి చర్యలు చేపడితే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.